క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: యాగంటిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 21 రోజులు పూర్తయిన సందర్భంగా జాతర చేపట్టారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండిబ్రహ్మానందరెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, ప్రసాదరెడ్డి, మన్మథరెడ్డి యామసుధాకర్‌రెడ్డి, బోయ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం



దాతలను సత్కరిస్తున్న చౌడేశ్వరీ దేవి ఆలయ కమిటీ సభ్యులు

బేతంచెర్ల: పట్టణ సమీపాన కొలుములపల్లె రహదారిలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయ అభివృద్ధితో పాటు కల్యాణ మండపం నిర్మాణానికి సహరించిన దాతలకు సన్మానించారు. మంగళవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు గౌరి హుస్సేన్‌రెడ్డి, సభ్యులు మల్లు సుబ్బారెడ్డి, రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో దాతలు కర్నూలు మేరు ఆటోమొబైల్స్ నిర్వాహకులతో పాటు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పారిశ్రామిక వేత్తలు గుండా గోపాలు, శేషఫణి, మల్లు హుస్సేన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి , పోలూరు రాఘవ రెడ్డి, తిరుమల శ్రీను, ఉన్నం చంద్ర శేఖర్, శంకరయ్యను ఘనంగా సత్కరించారు.

ఘనంగా పాదుకల ప్రతిష్ట

బేతంచెర్ల: గోర్లగుట్ట గ్రామంలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో సింహ వాహనం, పాదుకలు ప్రతిష్ట కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. దాత జీవరత్నం పెద్దమ్మ తల్లికి సింహ వాహనం, పాదుకలు సమర్పించారు. ఈసందర్భంగా వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

పేద విద్యార్థికి చేయూత



పేద విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న ఇన్నర్ వీల్‌క్లబ్ సభ్యులు

డోన్: ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్య అభ్యసించలేకపోతున్న పేద విద్యార్థికి డోన్ ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు చేయూతను నిచ్చారు. మంగళవారం పట్టణానికి చెందిన సుధాకర్‌రెడ్డి అనే పేద విద్యార్థికి రూ.30వేల విలువ గల యాపిల్ ల్యాప్‌టాప్‌ను క్లబ్ సభ్యులు రమణా రెడ్డి, అమృత దంపతులు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు మద్దమ్మ, కార్యదర్శి శకుంతల, సభ్యురాళ్లు సుమిత్ర రాజేష్, ముడియాల శైలజ, శారద, సరళ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చర్చి నూతన డీనరీకి సత్కారం

డోన్ : స్థానిక సీఎస్ఐ చర్చికి డీనరీ చైర్మన్‌గా మేకల రాజేంద్రబాబును నంద్యాల బిషప్ నియమించడం పట్ల చర్చి కమిటీ కార్యదర్శి మరియాదాస్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం చర్చి ఆవరణలో రాజేంద్రబాబు దంపతులను కమిటీ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జాన్ ప్రభాకర్, జీవన్‌కుమార్, ఎండ్రీ పాల్, వేదరత్నకుమారి, మాలతి, హైమావతి, విజయరాణి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సభ్యుల సేవలు ఆదర్శం

బేతంచెర్ల: సమాజాభివృద్ధే ధ్యేయంగా విద్య, వైద్య రంగాల్లో రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు ఆదర్శమని హెచ్‌ఎం పుల్లయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ ఆధ్వర్యంలో దాత వెంకటేశ్వర్ రెడ్డి సహకారంతో వాటర్ ట్యాంకును అంజేశారు. ఈసందర్భంగా రోటరీ క్లబ్ సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మాణిక్యం, అల్తాఫ్, మగ్బుల్, గణేష్‌రెడ్డి, రామూర్తి పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి

బేతంచెర్ల: ఆధ్యాత్మిక చింతనతోపాటు, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు వికాస భారతి సంఘటన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, అధ్యక్షుడు ఈవీ సుజాత శర్మ, భారతీయ స్ఫూర్తి కేంద్రం అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణ సమీపాన నంద్యాల రహదారిలోని ధ్యాన పిరమిడ్ కేంద్రంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కార్యక్రమంలో భజన కృష్ణయ్య, సంఘటన సభ్యులు గుండా గోపాల్, భువనేశ్వరరాజు, నాగ మోహన్, కందగడ్డల మోహన్, రామూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్‌క్లబ్‌పై ‘తమ్ముళ్ల’ కన్ను!

- భవనాలు వినియోగంలోకి రాకుండా మోకాలడ్డు!
- ప్రభుత్వం నుంచి నిధుల విడుదలను ఆపేయించిన వైనం
- ట్రాన్స్‌ఫార్మర్‌కు డబ్బివ్వకుండా అధికారులపై ఒత్తిడి



రూ.5కోట్లతో నిర్మించిన క్లబ్‌హౌస్, స్పోర్ట్స్‌క్లబ్ సముదాయం



క్లబ్‌హౌస్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పార్కు

డోన్: అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా అందిస్తామని అధికారంలోకి వచ్చిన టీడీపీ నేతలు ఆదిలోనే తమ స్వార్థప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా అందిన కాడికి దోచుకోవాలని ముమ్మర యత్నాలు చేస్తున్నారు. ఈక్రమంలో వారి కన్ను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌పై పడింది. అనుకున్నదే తడవుగా దాన్ని దక్కించుకోవడానికి పన్నాగం పన్నారు. ఇందులో భాగంగా కాంప్లెక్స్ వినియోగంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఎలాగైనా దాన్ని దక్కించుకోవాలని చేయని ప్రయత్నం లేదు. ఫలితంగా ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచాల్సిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది.

అక్కరకు రాని చుట్టం

నియోజకవర్గ కేంద్రం నడిబొడ్డున రైల్వేజంక్షన్ కూడలికి అత్యంత సమీపంలో రూ.5కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అత్యంత అధునాతనంగా నిర్మించారు. 15 సెంట్ల యూనియన్ క్లబ్ సొసైటీ స్థలంలో బెంగళూరు, హైదరాబాదు నగరాల్లో నిర్మించిన రెస్టారెంట్, మినీ ఫంక్షన్‌హాళ్లను తలదన్నే రీతిలో క్లబ్‌హౌస్‌ను తీర్చిదిద్దారు. జిమ్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్ పోటీలకు అనువుగా ప్రత్యేక హాళ్లు, మినీ ఫంక్షన్లకు సరిపడేలా నాలుగు సూట్లు, ఆధునిక మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఫంక్షన్‌హాల్ నిర్మించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు మున్సిపాలిటీ రూ.5 లక్షలను చెల్లించేందుకు తీర్మానం కూడా చేశారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ప్రభుత్వం నుంచి ఫర్నీచర్, జిమ్ము, టేబుల్ టెన్నిస్, స్నూకర్, క్యారమ్స్ పరికరాల కొనుగోలుకు మంజూరైన రూ.18 లక్షలు కూడా ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆధునిక వసతులతో నిర్మించిన ఈ ప్రాంగణం అక్కరకు రాని చుట్టంగా మిగిలిపోయింది.

క్లబ్ నిర్వహణ తామే చేపట్టాలని...

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను డోన్ యూనియన్ క్లబ్ సొసైటీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని మున్సిపాలిటీలో తీర్మానించారు. ఇందులో వచ్చిన ఆదాయంలో 7 సొసైటీకి మిగతా మొత్తం మున్సిపాలిటీకి వెళ్లేలా నిర్ణయించారు. అయితే ప్రభుత్వం మారడంతో అధికార పార్టీ నేతల కన్ను స్పోర్ట్స్ కాంప్లెక్స్‌పై పడింది. దీంతో ఎలాగైనా స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్వహణను తమ గుప్పిట్లో ఉంచుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిధులు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.18 లక్షలు రాకుండా అడ్డుకోగలిగారు. స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్వహణ విషయంలో ప్రభుత్వం నుంచి జీఓ విడుదల చేయించి ఎలాగైనా తమ గుప్పిట్లో ఉంచుకోవాలని అధికార పార్టీ నేతలు ముమ్మరంగా యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం స్వలాభం కోసమే టీడీపీ నాయకులు భవనాలను నిరుపయోగంగా ఉంచడంతోపాటు తమకు ఆహ్లాదం, ఆనందాన్ని దూరం



ప్రత్యేక హాల్లో ఏర్పాటుచేసిన టేబుల్ టెన్నిస్, క్యారమ్స్

చేస్తున్నారని పట్టణ ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవనాలు ఎందుకీ పనికి రాకుండా పోయి రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు డబ్బు చెల్లించాలి



గతంలో ఆమోదించిన విధంగా రూ.5 లక్షలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఆ శాఖకు మున్సిపాలిటీ చెల్లించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. నిధులు లేవనే సాకుతో అధికారులు డబ్బులివ్వకపోవడం భావ్యం కాదు. మధ్యతరగతి ప్రజలు, క్రీడాకారుల అవసరాలు తీర్చేందుకు ఈ క్లబ్ హౌస్ ఎంతగానో ఉపయోగపడుతోంది. – మల్లికార్జునరెడ్డి, యూనియన్‌క్లబ్ సొసైటీ అధ్యక్షుడు, కౌన్సిలర్, డోన్.

రాజకీయ కక్ష సరికాదు



ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్లబ్‌హౌస్ అందరికీ ప్రయోజనకారిగా ఉంటాయి. రూ.కోట్లు వెచ్చించి కట్టిన ఈ భవంతిలో కనీస సౌకర్యాల కల్పనకు రూ.18 లక్షలు మంజూరైనా కూడా కొందరు అడ్డుకోవడం దుర్మార్గం. స్వార్థపూరిత చర్యలు మాని కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రజోపయోగకరమైన భవనాలను వినియోగంలోకి తెవాలి. – కటిక వేణు, కౌన్సిలర్, డోన్.

సొసైటీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి



డోన్‌లో నిర్మించిన స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ మొత్తం డోన్ యూనియన్ క్లబ్ సొసైటీ ఆధ్వర్యంలోనే ఉంటుందని భావించాం. అయితే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం రెస్టారెంట్‌తో పాటు పై మూడింటిని తమ గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తుండటం అత్యంత దుర్మార్గమైన చర్య. – మేకల నాగరాజు, మాజీ కౌన్సిలర్, డోన్.

రక్తదానం ప్రాణదానంతో సమానం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

బనగానపల్లెరూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ లలిత అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో రక్తదానం ఆవశ్యకత, అపోహలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 8 వయసు నుంచి 65 ఏళ్లలోపు పురుషులు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి, స్త్రీలు నలుగు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. జంతుశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ మహమ్మద్‌గౌస్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల నీరసించి పోతారనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. చెడు అలవాట్లు ఉన్న వారు, హైపటైటిస్ బీ,సీ, హెచ్‌ఐవీ, రక్తపోటు అధికంగా ఉన్నవారు రక్తదానం చేసేందుకు అనర్హులన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నంద్యాల చైర్మన్ డీపీ దస్తగిరి రక్తదానం అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాబునాథ్, అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, నీతమ్మ, కౌసల్యదేవి, రామన్న, నాగ రాజారెడ్డి, వరలక్ష్మీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

సంజామల: ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ పోచా రమాదేవి అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ ఆయా శాఖల అధికారులతో సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ అనిల్ కుమార్, ఏఓ విజయకుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ రాధికా రెడ్డి, ఏఓ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ గుండం రాజేశ్వరమ్మ, ఈడిగ రమాదేవి పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి వృద్ధురాలు



అనాథ ఆశ్రమంలో చేర్పిస్తున్న స్ఫూర్తి సభ్యులు

డోన్ టౌన్ : కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన అనంతమ్మ అనే వృద్ధురాలిని మంగళవారం స్ఫూర్తి సంస్థ సభ్యులు అనాథాశ్రమంలో చేర్పించారు. పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో కొంత కాలంగా ఆహారం, నిద్ర లేక అత్యంత దయనీయ స్థితిలో ఉన్న అనంతమ్మ అనే వృద్ధురాలు గుర్తించిన స్ఫూర్తి సంస్థ సభ్యులు మధు, నారాయణస్వామి, భాస్కర్, శివయ్య తదితరులు ఆమెను చేరదీశారు. ఆమెకు సపర్యలు చేసిన అనంతరం ఆమెను అనంతపురం సమీపంలోని ఆశ్రయ వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఈసందర్భంగా వారు ఆమెకు తరలించడానికి సహకరించిన కిక్ సుధాకర్‌రెడ్డి, సీమ సుబ్బారెడ్డిలతో పాటు ఆశ్రమ నిర్వాహకులు కృష్ణారెడ్డి, దేవి దంపతులకు వారు కృతజ్ఞతలు తెలియజేసారు.


స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న దృశ్యం

బనగానపల్లె : ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు గ్రామానికి చెందిన రాజగోపాల్, ఆయన కుమారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోపడుతుందన్నారు. రాజగోపాల్ మాట్లాడుతూ పిల్లల శ్రేయస్సు కోరి సుమారు రూ.25 వేల విలువైన పుస్తకాలను పంపిణీ చేయడం ఆనందదాయకమన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాండురంగారెడ్డి, కుమార్‌బాబు, రామచంద్రారెడ్డి, కృష్ణయ్య, సుబ్బరాయుడు మధుసూదన్‌రెడ్డి సుధాకర్‌రెడ్డి, రషీదాబేగం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అన్వర్

డోన్ రూరల్ : ఆటో కార్మికులకు ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నంద్యాల జిల్లా అధ్యక్షుడు అన్వర్, నేత పుల్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పినా ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. ఆటో డ్రైవర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.15 లక్షల బీమా, సహజ మరణమైతే రూ.10 లక్షలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాల జరిమానాకు సంబంధించి జీఓలు 21, 31ను రద్దు చేయాలన్నారు. వాహనాల ఎఫ్‌సీల బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందించారు. నాయకులు వెంకటేష్‌గౌడ్, ఖాసిం, మధు, శివ, మస్తాన్, అంజి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల బోల్తా

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై మ్యాక్స్ ఫోర్ హోటల్ ఎదురుగా మంగళవారం తెల్లవారు జామున వాహనాలు అదుపుతప్పి బోల్తాపడ్డాయి. మల్యాల గ్రామం నుండి వేరుశనగ కాయల లోడుతో కర్నూలుకు మార్కెట్‌కు వెళుతున్న బొలెరో వాహనం ఘటనాస్థలం వద్దకు రాగానే అతివేగానికి అదుపుతప్పి బోల్తాపడింది. వెనుక వస్తున్న మరో టెంకాయల లారీ కూడా పక్కనే ఉన్న డివైడర్ ఢీకొని బోల్తాపడింది. ఆ వెంటనే వచ్చిన గ్యాస్ సిలిండర్ల లారీ డివైడర్ ఎక్కి రూరల్ పోలీసు స్టేషన్ వైపు దూసుకెళ్లింది. ఘటనలో యాపదిన్నే గ్రామానికి చెందిన రైతు అశోక్, బొలెరో డ్రైవర్ లక్ష్మయ్య, టెంకాయల లోడు లారీ డ్రైవర్ కేరళకు చెందిన అనీల్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. పట్టణ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి అక్కడికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సంక్షిప్తం

నేడు జిల్లెల్లలో గ్రామసభ

బనగానపల్లె రూరల్: జిల్లెల్ల గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణ రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామసభలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలపై ప్రజలను నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కంపచెట్ల తొలగింపు

కొలిమిగుండ్ల: మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఉన్న కంపచెట్లను మంగళవారం సర్పంచ్ శివరాముడు జేసీబీతో తొలగింపజేశారు. కమ్యూనిటీ హాల్ చుట్టూ కంపచెట్లు పెరిగిపోయి పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. స్థానికులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారు. జేసీబీతో హాల్ చుట్టూ ఉన్న కంపచెట్లు, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి పరిసరాలు శుభ్రం చేయించారు. అడిగిన వెంటనే చర్యలు తీసుకున్న సర్పంచ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం సహాయ నిధికి రూ.30 లక్షల విరాళం

బనగానపల్లె రూరల్ : విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి నంద్యాల మ్యూచ్యువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ డిస్ట్రిక్ ఫెడరేషన్(జిల్లా మహిళా సమఖ్య) రూ.30 లక్షల విరాళాన్ని అందించింది. మంగళవారం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి చెక్కు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా విరాళాలు అందించి బాధితులను ఆదుకోవాలని మంత్రి కోరారు.

మంత్రి బీసీని కలిసిన ఆర్డీఓ

నంద్యాల ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన చల్లా విశ్వనాథ్ రాష్ట్ర రోడ్లు భవనలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక మంత్రి క్యాంప్ ఆఫీస్‌లో ఆర్డీఓ మంత్రి బీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి ఆర్డీఓకు సూచించారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం

డోన్ రూరల్ : స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం డాక్టర్ సెలస్టియల్ ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని ఆయుర్వేద దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

సంజామల: అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. అక్కంపల్లెకు చెందిన కృష్ణారెడ్డి కుమార్తె వైదేహని ఐదేళ్ల క్రితం కడప జిల్లా పెద్దముడియం మండలం కల్వాటాలకు చెందిన రెక్కల శ్రీకాంత్‌రెడ్డి వివాహం చేసుకున్నాడు. రెండేళ్ల నుంచి భర్తతో పాటు మామ వెంకటసుబ్బారెడ్డి, అత్త అచ్చమ్మ, ఆడపడుచులు సులోచన, లక్ష్మి అదనపు కట్నం కోసం వైదేహని మానసికంగా, శారీరకంగా వేధించారు. దీంతో మంగళవారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాహనపత్రాలు తప్పనిసరి

డోన్ రూరల్ : వాహనదారులు వాహనపత్రాలను తప్పనిసరిగా కల్గి ఉండాలని ఆర్టీఓ క్రాంతికుమార్, ఆర్టీసీ డీఎం శశిభూషణ్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు రోడ్లలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక లోడ్‌తో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అధిక లోడ్, సరైన అనుమతి పత్రాలులేని 21 వాహనాలకు రూ.85 వేలు జరిమానా విధించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

డోన్ టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం సీఐలు ఇంతియాజ్‌బాషా, సీఎం రాకేష్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



మాట్లాడుతున్న మండల సర్వేయర్ గీతాభవాని

బనగానపల్లె రూరల్ : రీ సర్వేలో రైతులకు వచ్చిన భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల సర్వేయర్ గీతాభవాని అన్నారు. మంగళవారం జంబులదిన్నె గ్రామంలో రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా మండల సర్వేయర్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన భూసర్వేలో సమస్యలపై ఆర్జీ రూపంలో దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. మొత్తం 13 మంది రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ రాఘవేంద్ర, వీఆర్‌వోలు అబ్దుల్లా, ప్రసాద్, విలేజ్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలో ఈ నెల 22న ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు మంగళవారం ముగిశాయి. చివరి రోజు వెంగళాంపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భారతి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఆరు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై రైతుల నుంచి 232 ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

వీఓఏలపై రాజకీయ వేధింపులు ఆపాలి



వెలుగు కార్యాలయం ముందు నిరసన తెలుపుతన్న వీఓఏలు

బేతంచెర్ల: వీఓఏలపై రాజకీయ నాయకుల వేధింపులతో పాటు అక్రమ తొలగింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి వీఓఏల మండల సంఘం మండల కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ర్యాలీగా వెలుగు కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఓఏలు మాట్లాడుతూ తమపై రాజకీయ నాయకులు వేధింపులకు దిగడం సరికాదన్నారు. రాజకీయ నాయకులు ఒత్తిడితో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా వీఓఏలను తొలగించడం దారుణమన్నారు. గతంలో ఉన్నవారిని కొనసాగించాలని లేకపోతే అందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిని వనతిపత్రాన్ని వెలుగు ఏపీఎం మధు సుదర్శన్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో వీఓఏలు మహాలక్ష్మి, ఎల్లయ్య, శంకర్, విజయ శాంతి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: నగర పంచాయతీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చైర్మన్ చలం రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. నగర పంచాయతీలో రోజుకు 10 టన్నుల చెత్త వస్తుందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద మంజూరైన లెగసి వేస్ట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ, శానిటరీ లాండ్ ఫిల్స్ ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరుచేస్తామన్నారు. అనంతరం మిషనరీ ఏర్పాటుకు నిధుల చెల్లింపులతోపాటు పట్టణంలో అభివృద్ధి పనులు, తాగునీటి తొట్ల మరమ్మతు, పెయింట్ వేసేందుకు నిధుల చెల్లించాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, ఫర్వీన్, వార్డు కౌన్సిలర్లు ఇబ్రహీమ్, మధు, ముబీనా, కుమారి, అంజి పాల్గొన్నారు.

లాభసాటి దిగుబడులు సాధించాలి

కోవెలకుంట్ల: రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి లాభసాటి దిగుబడులు సాధించాలని ఏడీఏ సుధాకర్ సూచించారు. వల్లంపాడు, లింగాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో రైతులు విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడుతున్నారన్నారు. దీంతో భూమిలో పోషకాలు నశించి దిగుబడులు తగ్గిపోతాయన్నారు. ఈ నెల 1 నుంచి రబీ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా రైతులు పంటలు సాగు చేసిన వెంటనే ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం సంభవిస్తే ఈ పంట నమోదు ఆధారంగానే నష్ట పరిహారం అందజేస్తామన్నారు. అనంతరం వివిధ పంటల యాజమాన్యం, శనగ విత్తన పంపిణీ, తెగుళ్లు, పురుగుల నివారణ, భూసార పరిరక్షణ ఆవశ్యకత, భూసార పరీక్షల పత్రాల పంపిణీ, కిషాన్ డ్రోన్ల వినియోగం, బిందుసేద్యం, తదితర అంశాలను వివరించారు. ఏఓ నిరంజన్, పశు వైద్యాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

73 మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల నుంచి బెల్ట్‌షాపుకు మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రవీంద్రనాథరెడ్డి మంగళవారం కోవెలకుంట్ల నుంచి మద్యం బాటిళ్లను గ్రామంలో విక్రయించేందుకు తీసుకెళుతున్నాడు. దీనిపై అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి అతని వద్ద నుంచి 73 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చెయ్యాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిందన్నారు. పథకాలు అందక పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాసూం,శరత్, నవదీప్, అక్బర్‌బాషా, రంగనాయకులు, విజయ్‌కుమార్, రాజేంద్రనాథ్, మహేంద్ర, సుకుమార్, మధుసూదన్, సుదర్శన్, రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.